

# కష్టకాలంలో కమల్ సలహా

**రజనీకాంత్** తాజాగా తన 'దళపతి'నాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా షూటింగ్‌లో జరిగిన ఓ సంఘటన గురించి ఆయన చెబుతూ.. ''దళపతి'లో అమ్రీష్‌పురీ పాత్ర మెయిన్ విలన్. క్రూరుడైన రాజకీయనాయకుడిగా నటించారాయన. ఆయన కాంబినేషన్‌లో ఓ సన్నివేశం ఉంది. సినిమాలో చాలా ముఖ్యమైన సన్నివేశం అది. ఆ సీన్‌లో ఆయనతో నేను సవాల్ విసురుతా. మణిరత్నం ముందే చెప్పారు 'ఈ సీన్ చాలా కీలకం.. మీరు ఎంత బాగా చేస్తే ఆ సీన్ అంతబాగా పండుతుంది' అని. నేను కూడా ఛాలెంజ్‌గా తీసుకున్నా. అయితే ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా చేసినా మణిరత్నం మాత్రం తృప్తి పడటంలేదు. లెక్కలేనన్ని టేకులు తీసుకున్నా. కానీ ఓకే మాత్రం అవ్వడంలేదు. చివరికి నాపై నేను నమ్మకం కోల్పోయే పరిస్థితికొచ్చా. ఏం చేయాలో అర్థం కాక, షూటింగ్‌కి కాస్త గ్యాప్ రాగానే నా మిత్రుడు కమల్‌హాసన్‌కి కాల్ చేసి, విషయం చెప్పా. తను నవ్వి.. 'ఇలాంటిది జరుగుతుందని ముందే తెలుసు. ఓ పనిచెయ్.. ఆ సన్నివేశాన్ని మణిరత్నాన్ని నటించి చూపించమను.' అని సలహా ఇచ్చారు. తను చెప్పింది పాటించా. వెంటనే సమస్య తీరిపోయింది. నేనేం చేస్తే దాన్నే ఓకే చేశారు.' అంటూ నవ్వుతూ చెప్పుకొచ్చారు రజనీ. ఈ జ్ఞాపకంతో రజనీ, కమల్‌ల స్నేహం ఎంత బలమైందో మరోసారి అర్థమైంది.

# బాలీవుడ్ నుంచి పిలుపు

**ఒకానొక దశలో** శ్రీలీల నటించిన సినిమా శుక్రవారానికి ఒకటి విడుదలయ్యేది. అసలు ఈ అమ్మాయి ఇన్ని సినిమాలకు డేట్స్ ఎలా ఇస్తుంది? అనే విషయంపై ఫిల్మ్ వర్గాల్లో చర్చలు ఓ రేంజ్‌లో జరిగాయి. అయితే.. అన్ని సినిమాలు చేసినా విజయాలు మాత్రం అరాకొరే. ధమాకా, భగవంత్ కేసరి సినిమాలు మినహాయిస్తే చెప్పుకోదగ్గ విజయాలు ఈ ముద్దుగుమ్మకు రాలేదనే చెప్పాలి. అందుకే.. రాశి కంటే వాసి ముఖ్యమని భావిస్తున్నది శ్రీలీల. అవకాశాలు వస్తున్నా ఆచితూచి నిర్ణయాలు తీసుకునే పనిలో ఉంది. తాజాగా ఓ అగ్ర హీరో సినిమాలో ఐటమ్ సాంగ్ కోసం శ్రీలీలను కలిస్తే సున్నితంగా తిరస్కరించిందని ఫిల్మ్ వర్గాల టాక్. ఇదిలావుంటే.. ప్రస్తుతం శ్రీలీల చేస్తున్న సినిమాలు ఉస్తాద్ భగత్‌సింగ్, ఆర్‌టీ 75. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ డెబ్యూ మూవీలో కూడా శ్రీలీల పేరే ఎక్కువ వినిపిస్తున్నది. ఇదిలావుంటే.. బాలీవుడ్‌లో సిద్ధార్థ్ మల్హోత్ర కథానాయకుడిగా నటిస్తున్న 'మిట్టి' చిత్రంలో శ్రీలీల ఓ కీలక పాత్ర పోషించనుందని బాలీవుడ్ మీడియాలో కథనాలు ప్రసారమవుతున్నాయి. కథాగమనంలో తన పాత్ర కీలకంగా ఉండటంతో శ్రీలీల ఈ సినిమాకు వెంటనే అంగీకరించిందని తెలిసింది. అక్టోబర్‌లో ఈ సినిమా ప్రారంభం కానున్నదట. వీటితోపాటు తమిళంలో కూడా రెండు సినిమాలకు ఈ అందాలభామ సంతకం చేసినట్టు తెలుస్తున్నది. ఏది ఏమైనా.. దూకుడు తగ్గించి, ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్న ఈ తెలుగమ్మాయికి ఇకనైనా విజయాలు పలకరిస్తాయో లేదో చూడాలి.



# నిజంగా ఆశ్చర్యపోయాను



**సూపర్‌స్టార్** కొడుకుననే భేషజం ఇసుమంత కూడా కనిపించదు రామ్‌చరణ్‌లో. పాన్‌ఇండియా హీరో స్థాయికి ఎదిగినా ఇప్పటికీ ఒదిగే వుండటం ఆయన స్టైల్. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఇష్టాఇష్టాల గురించి చెప్పుకొచ్చారు రామ్‌చరణ్. తన సినిమాల్లో తనకు నచ్చిన సినిమా ఏంటి? అనడిగితే తడుముకోకుండా ఆరంజ్, రంగస్థలం సినిమాల పేర్లు చెప్పేశారు రామ్‌చరణ్. 'మగధీర' గురించి ప్రస్తావిస్తే.. 'అది నా అభిమానులకు ఇష్టమైన సినిమా. నా కెరీర్‌ని నిలబెట్టిన సినిమా కూడా'.. అని సమాధానమిచ్చారు చరణ్. అంతే కాదు, తనకు సినిమాల్లో యాక్షన్ సినిమాలంటే ఇష్టమని, దుస్తుల్లో సంప్రదాయ దుస్తులకే ప్రాధాన్యత ఇస్తానని ఆయన చెప్పుకొచ్చారు. ఇష్టమైన హీరోహీరోయిన్లు? అనడిగితే.. తమిళ హీరో సూర్య, సమంత అని సూటిగా బదులిచ్చారు. ఇక తన జీవితంలో మరచిపోలేని ఫ్యాన్ మూమెంట్ గురించి చెబుతూ 'ఇండియాలో నాకు చాలామంది అభిమానులున్నారు. వాళ్లు నాపై అభిమానం చూపించడం కామన్. అయితే.. 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రమోషన్స్‌కి జపాన్ వెళ్లాం. అక్కడ ఓ 70ఏళ్ల వృద్ధురాలు నాకు 180 పేజీల పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చింది. అది ఓపెన్‌చేసి చూస్తే. అందులో నేను చేసిన పాత్రలు, చిత్రాలకు సంబంధించిన బొమ్మలు ఉన్నాయి. వాటిని ఆమె స్వయంగా గీశారట. నిజంగా ఆశ్చర్యపోయాను. ఆమెది నా భాష కాదు, నా దేశం కాదు. కానీ అభిమానంతో నా బొమ్మలు గీశారు. జీవితంలో మరిచిపోలేని సంఘటన అది.' అంటూ గుర్తుచేసుకున్నారు రామ్‌చరణ్.

# రవితేజకు తీవ్రగాయం



**అగ్ర నటుడు రవితేజ** కుడి చేతికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో శస్త్ర చికిత్స జరిగింది. ఆయన్ని ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. వివరాల్లోకెళ్తే.. 'ఆర్‌టీ 75'(వర్కింగ్ టైటిల్) సినిమా చిత్రీకరణ జరుగుతుండగా ప్రమాదవశత్తూ రవితేజ కుడి చేతికి స్వల్ప గాయమైంది. గాయం చిన్నదే అయినా.. దాన్ని లెక్క చేయకుండా అవిశ్రాంతంగా చిత్రీకరణలో పాల్గొనడం వల్ల అది తీవ్రమైందని వైద్యులు పేర్కొన్నారు. దీంతో శస్త్రచికిత్స చేయడం తప్పలేదని వారు అన్నారు. రవితేజ గాయపడిన విషయం తెలుసుకున్న అభిమానులు షాక్‌కి గురయ్యారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో కామెంట్లు కూడా పెడుతున్నారు. ఇక 'ఆర్‌టీ 75' సినిమా వివరాల్లోకెళ్తే.. రచయిత భాను భోగవరపు దర్శకుడిగా మారి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈసినిమాను తీర్చిదిద్దుతున్నారు. శ్రీలీల ఇందులో కథానాయిక.

# మిరాయ్ ఓ అద్భుతం



**'హను-మాన్'తో** పాన్ ఇండియా విజయాన్ని సొంతం చేసుకున్న తేజ సజ్జా కథానాయకుడిగా రూపొందుతోన్న సూపర్‌హీరో మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఈ సినిమా విడుదల కానుంది. తేజా పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఈ సినిమా న్యూ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో తేజా యోధుడుగా కనిపించనున్నాడు. దానికి తగ్గట్టే పోస్టర్ కూడా డిజైన్ చేశారు. పోస్టర్‌లో మండుతున్న ఐరెన్ రాడ్‌ను పట్టుకుని పైకి చూస్తున్న తేజాను చూడొచ్చు. తేజా నేపథ్యంలో పురాతన దేవాలయం కనిపిస్తున్నది. సినిమాపై ఆసక్తిని పెంచేలా పోస్టర్ ఉందని చెప్పొచ్చు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరపై కొత్త ప్రపంచాన్ని చూపించనున్నాడని, అత్యుత్తమ సాంకేతిక విలువలతో సినిమా ఉంటుందని నిర్మాత చెబుతున్నారు. మంచు మనోజ్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: గౌరహరి, స్క్రీన్‌ప్లే, మాటలు, కెమెరా, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని, నిర్మాణం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.

# హత్య వెనక రహస్యం



**మల్లెపువ్వు, మెంటల్‌కృష్ణ,** కలవరమాయే మదిలో వంటి చిత్రాలను తీసిన నిర్మాత మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా మారారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'ఎమ్4 ఎమ్' (మోటివ్ ఫర్ మర్డర్). సంభీత్ ఆచార్య, జోశర్మ జంటగా నటిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్‌కు అద్భుతమై స్పందన లభిస్తున్నదని, హత్యా నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే థ్రిల్లర్ చిత్రమిదని, వసంత్ అందించిన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెలిపారు. ఈ చిత్రానికి కథ: మోహన్ వడ్లపట్ల, జోశర్మ, రాహుల్ ఆడబాల, దర్శకత్వం: మోహన్ వడ్లపట్ల.

# హేమపై సస్పెన్షన్ ఎత్తివేత

**బెంగళూరు** డ్రగ్స్ కేసు నేపథ్యంలో సినీ నటి హేమపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (మా) నిర్ణయం తీసుకుంది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు నేతృత్వంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపింది. కొద్ది రోజుల క్రితం బెంగళూరు రేవ్ పార్టీ డ్రగ్స్ వ్యవహారంలో అక్కడి పోలీసులు హేమను అరెస్ట్ చేశారు. అనంతరం 'మా' ఆమెపై సస్పెన్షన్ విధించింది. అయితే ఇటీవల విడుదల చేసిన వీడియోలో తాను ఎలాంటి డ్రగ్స్ తీసుకోలేదని, దేశంలోనే ఉన్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నట్లు హేమ తెలిపింది. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలని, 'మా'తనకు అండగా నిలవాలని ఆమె అభ్యర్థించింది. ఈ విషయాలతో 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకు లేఖ రాయడంతో పాటు మెడికల్ సర్టిఫికెట్‌లను కూడా అందజేసింది. ఈ ఆధారాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఎగ్జిక్యూటివ్ కమిటీ హేమపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.






